క్లుప్తంగా

డ్వామా అధికారులకు ముగిసిన శిక్షణ



శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ఈటీసీ ప్రిన్సిపాల్

సామర్లకోట: డ్వామా అధికారులకు మూడు రోజుల పాటు ఇచ్చిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కో ఆర్డినేటర్, డ్వామా ఏపీడీ జి.రమేష్ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో పలు జిల్లాల ఏపీడీ, ఏపీఓలకు ఇస్తున్న శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా రాత పరీక్ష నిర్వహించారు. డ్వామాలో రూపొందించిన కొత్త స్టాఫ్‌వేర్, పనుల్లో నాణ్యత, సాంకేతిక పరిజ్ఞా నం, వ్యక్తిత్వ వికాసం, ప్రస్తుత సీజన్ మొక్కల నాటడంపై శిక్షణ ఇచ్చారు. ఎస్ఐఆర్‌డీ ప్రొఫెసర్ కృష్ణ లోహిదాసు ఉన్నతి ప్రాజెక్టుపై శిక్షణ ఇచ్చారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

శృంగార వల్లభుని దర్శనానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో శృంగారవల్లభ స్వామి

పెద్దాపురం: తిరుపతి శృంగార వల్లభ స్వామి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ పులి నారాయణమూర్తి భక్తులకు ఏర్పాట్లు చేశారు. వివిధ మార్గాల ద్వారా స్వామికి 3,69,723 రూపాయలు ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. సుమారు ఆరు వేల మంది స్వామిని దర్శించుకోగా భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం చేసినట్లు ఈఓ తెలిపారు.

ప్రతిష్టాత్మకంగా నా భూమి-నా దేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ అశోక్‌కుమార్

పెద్దాపురం: ఈ నెల 9వ తేదీన నిర్వహించే నా భూమి నా దేశం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఎంపీడీఓ బత్తిన అశోక్ కుమార్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో ఈ మేరకు సమీక్షించారు. నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. 10వ తేదీన నిర్వహించే జాతీయ నులిపురుగుల దినోత్సవంలోను సిబ్బంది భాగస్వాములై డీవార్మింగ్ ట్యాబ్లెట్‌లను పిల్లలతో మింగించాలని సూచించారు. సమావేశంలో పరిపాలనాధికారి సత్యనారాయణ మూర్తి, ఈఓ పీఆర్డీ మూర్తి, జగన్నాథం, ఆయా పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు వెళ్లి పింఛను అందజేత

పెద్దాపురం: మండలం చదలాడ గ్రామానికి చెందిన వలంటీర్ పొన్నాడ లక్ష్మీ గాయత్రి తమ పరిధిలో వితంతు పింఛన్‌ను లబ్ధిదారు తులసమ్మకు శనివారం కాకినాడ జీజీహెచ్‌కు వెళ్లి అందజేశారు. లబ్ధిదారు చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఆమె అక్కడికే వెళ్లి పింఛన్ అందజేశారు.

పారాయణం నిర్వాహకులకు సత్కారం



మల్లికార్జున స్వామిని సత్కరించిన దొరబాబు తదితరులు

సామర్లకోట: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించిన ధర్మగీతా ప్రచారకులు మల్లికార్జున స్వామిని శనివారం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆంజనేయస్వామికి ఆయన పూజలు చేశారు. ఆదివారం ఆలయంలో శాంతి కల్యాణం జరుగుతుందని నిర్వాహకులు కటకం కృష్ణ సృజన్ తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, పంచారామ క్షేత్ర ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దొరబాబును మల్లికార్జున స్వామి, వాసవీ యూత్ సభ్యులు సత్కరించారు.

వడివడిగా గ్రామ స్వరాజ్యం..

- అందుబాటులోకి ప్రభుత్వ సేవలు
- జోరుగా సచివాలయ, ఆర్బీకే విలేజ్ క్లినిక్‌ల నిర్మాణాలు

పెద్దాపురం: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం దిశగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రజలకు అందుబాటులో సచివాలయాలు, రైతులకు అండగా రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌ల వంటి సేవలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతోంది.

రూ.16.66 కోట్లతో 62 భవనాలు..

పెద్దాపురం అర్బన్, రూరల్‌కు సంబంధించి 62 భవన సముదాయాలు సచివాలయాలు, ఆర్బీకే, విలేజ్ క్లినిక్‌లకు ప్రభుత్వం సుమారు రూ.16.66 కోట్లు కేటాయించింది. కొన్ని భవనాలు వినియోగంలోకి రాగా, మరికొన్ని నిర్మాణంలో ఉన్నాయి. .

రైతులకు అండగా ఆర్బీకేలు

రైతులకు వ్యవసాయ సంబంధ సమగ్ర సమాచారం అందుబాటులోకి వచ్చేలా ఆర్బీకేలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నియోజకవర్గంలో 80 ఆర్బీకేలు ఉన్నాయి. రైతు విజ్ఞాన కేంద్రాలుగా ఇవి సేవలందిస్తున్నాయి.

ముంగిట్లో వైద్య సేవలు..

గ్రామీణులకు వైద్యం అందుబాటులో ఉండేలా విలేజ్ క్లినిక్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రతి 2500 మంది జనాభాకు ఒక విలేజ్ క్లినిక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. వెయింటింగ్ హాల్, ఎగ్జామినేషన్ రూమ్, ఓపీ గది, ఫార్మసిస్ట్ గది, ఏఎన్‌ఎం క్వార్టర్‌తో కూడిన సదుపాయాలు ఈ కేంద్రంలో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. 60 విలేజ్ క్లినిక్‌లకు ఒక్కో విలేజ్ క్లినిక్‌కు రూ.20.8 లక్షలు మేర నిధులు కేటాయించారు. పలు చోట్ల భవన నిర్మాణ పనులు జోరుగా కొనసాగుతున్నాయి.

మండలంలో సేవలిలా..

పంచాయతీలు:	23
సచివాలయాలు:	22
సచివాలయ ఉద్యోగులు:	224
వలంటీర్లు :	478
ఏప్రిల్ ఒకటి 2019 నుంచి ఇప్పటి వరకు శాఖల వారీగా అందిన సేవలు :	
రెవెన్యూ:	36,623
పంచాయతీ రాజ్:	1622
పౌర సరఫరాల శాఖ :	2869
ఆధార్ :	58,133



ప్రజలకు సేవలందిస్తున్న కట్టమూరు సచివాలయం

సకాలంలో ప్రభుత్వ సేవలు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు పలు రకాల సేవలు సకాలంలో అందుతున్నాయి. గతంలో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవారు. జగనన్న పాలనలో ప్రజలు ఎటువంటి లంచాలకు తావులేకుండా ప్రభుత్వ సేవలు పొందుతున్నారు.

– బందారు వీరబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్, జి.రాగంపేట, పెద్దాపురం మండలం


సచివాలయ నిర్మాణాలు మరింత వేగవంతం



నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనాలను త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు చేపడతాం. ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌ల ఏర్పాటు ద్వారా అన్ని రకాల ప్రజలకు మెరుగైన సేవలందుతున్నాయి.

– కె.జగదీష్, మండల ఇన్‌చార్జి పంచాయతీరాజ్ జేఈ, పెద్దాపురం

విరబూసిన బ్రహ్మ కమలాలు



వాకతిప్పలో విరబూసిన బ్రహ్మ కమలాలు

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్పకు చెందిన వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్ ఇంటి వద్ద బ్రహ్మ కమలం చెట్టు విరబూసింది. ఒక్కసారే ఆరు బ్రహ్మ కమలాలు పూసి ఆకట్టుకుంటున్నాయి. వీటిని చూసేందుకు స్థానికులు తరలివస్తున్నారు.

9న ట్రస్ట్ బోర్డు సమావేశం

సామర్లకోట: పంచారామ క్షేత్రంలో శ్రావణ మాసంలో నిర్వహించే వరలక్ష్మి వ్రతాలకు సంబంధించి చర్చించడానికి 9వ తేదీ ఉదయం 10 గంటలకు ఆలయంలో ట్రస్టు బోర్డు సమావేశం ఏర్పాటు చేసినట్టు ఆలయ ఈఓ డి నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఏటా రెండో శుక్రవారం మినహా మిగిలిన మూడు శుక్రవారాల్లోనూ ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలకు ఏర్పాటు చేస్తున్నారు.

సుపరిపాలనను చూసి ఓర్వలేకే దుష్ప్రచారం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- కొత్తపల్లిలో గడపగడపకూ మన ప్రభుత్వం



కొత్తపల్లిలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: రాష్ట్రంలో ప్రజలకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనను చూసి ఓర్వలేక పచ్చ చొక్కా నాయకులు, ఎల్లో మీడియా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలో శనివారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానికులు డ్రైనేజీలు, రోడ్లు, తాగునీరు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలను గుర్తించి పరిష్కరించడానికే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షలు కేటాయించి అభివృద్ధి పనులు చేస్తున్నట్టు తెలిపారు. టీడీపీ నేతలకు ముఖ్యమంత్రిని విమర్శించే అర్హత లేదన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో చేసిన అప్పులకు చేసిన అభివృద్ధికి పొంతనే లేదన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. అనంతరం సచివాలయ కన్వీనర్ సానా నాగు, అతని కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే దొరబాబును శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, బీసీ సెల్ మండలాధ్యక్షుడు గింజాల శ్రీనివాసరావు, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ డివిజన్ కమిటీ సభ్యుడు బండి దావీదు, రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, మండల సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, కొత్తపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు మారిశెట్టి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- కొత్తపల్లిలో తాగునీటి ట్యాంకు ప్రారంభం



కొత్తపల్లిలో తాగునీటి ట్యాంకు శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలో జల్ జీవన్ మిషన్ నిధులు రూ.59.80 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంకును శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇస్తామన్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో పైప్‌లైన్ పనులు చేపట్టామన్నారు. ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వం కూడా ఇటువంటి కార్యక్రమం చేపట్టలేదన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజల చెంతకే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. కుల, మతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఎల్లో మీడియా, ప్రతిపక్షాలు ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గవర భవాని, సచివాలయ కన్వీనర్ సానా నాగు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, పీఏసీఎస్ అధ్యక్షుడు మారిశెట్టి సత్తిబాబు, ఎస్సీ, ఎస్టీ డివిజన్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు, ఏఈ సంధ్య, వైఎస్సార్ సీపీ నాయకుడు గవర నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సంపద యోజనను సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారుడుకి లైవ్ ఫిష్ తరలింపు వాహనాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: మత్స్యకారులు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజనను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు సూచించారు. ప్రధాన మంత్రి మత్స్యసంపద యోజనలో భాగంగా కొత్తపల్లికి చెందిన మత్స్యకారుడు ఏడిద పెద్దకు సబ్సిడీపై మంజూరైన లైవ్ ఫిష్ తరలింపు వాహనాన్ని శనివారం ఎమ్మెల్యే లబ్ధిదారుడికి అందజేశారు. ప్రభుత్వ పథకాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రూ.20 లక్షల విలువైన లైవ్ ఫిష్ వాహనం, పరికరాలను ప్రభుత్వం 60 శాతం సబ్సిడీపై అందించినట్టు మత్స్యశాఖ ఏడీ కె.కరుణాకరరావు తెలిపారు. మండల సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, సర్పంచులు గవర భవానీ, నక్కా మణికంఠ, పులి జయబాబు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి శ్రీరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

కొత్తపల్లి ఎస్సీ కాలనీలో గర్భిణులు, బాలింతలకు శనివారం ఎమ్మెల్యే పెండెం దొరబాబు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జి మాధవి

పిఠాపురం: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జి కె. మాధవి సూచించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాధవి విద్యార్థులకు న్యాయ చట్టాలను వివరించారు. ప్రతి విద్యార్థి చట్టాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పట్టుదలతో చదివి భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. అధ్యాపకులు విద్యాబోధనతో పాటు రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, బాధ్యతలను విద్యార్థులకు తెలియజేయాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా రాజ్యాంగం మేరకు శిక్షించబడతారన్నారు. ర్యాగింగ్ చట్ట విరుద్ధమని, ఎవరైనా ర్యాగింగ్ చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. విద్యార్థులు డ్రగ్స్ జోలికి వెళ్లరాదని సూచించారు. కార్యక్రమంలో పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేరుగు రాజారావు, కేఎస్‌ఆర్ భాస్కర్, న్యాయవాదులు ఎం సత్యవాణి, కళాశాల ప్రిన్సిపాల్ వైవీఎస్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రాజాకు దవులూరి పరామర్శ



మంత్రి రాజాను పరామర్శించిన దొరబాబు

సామర్లకోట: రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖామంత్రి దాడిశెట్టి రాజాను రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు శనివారం పరామర్శించారు. ఇటీవల రాజా తల్లి సత్యనారాయణమ్మ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి రాజాకు తన సానుభూతి, సంతాపం తెలిపారు.

సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్న వైస్ చైర్మన్ సాయి ప్రసాద్

పెద్దాపురం: పట్టణంలోని పలు ప్రాంతాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కౌన్సిలర్ విడదాసరి రాజా, నల్లల గోవిందు, సూపర్‌వైజర్ రమణమ్మ వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. పట్టణంలోని 5వ వార్డులో కౌన్సిలర్ రాజా అధ్యక్షతన వైస్ చైర్మన్ సాయి ప్రసాద్, కట్టమూరులో నల్లల గోవిందు, ఆర్‌బి కొత్తూరులో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ ఆయా కిట్లను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో కౌన్సిలర్ త్సలికి సత్యభాస్కర్, ఏఎంసీ చైర్మన్ వల్లూరి జ్యోతి, యంగ్రు సత్తిబాబు, పల్లా శ్రీనివాస్ యాదవ్, ఎంపీటీసీ నల్లల సూర్యకుమారి, శేషకుమారి, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

బ్రౌన్‌పేటలో..

సామర్లకోట: స్థానిక బ్రౌన్‌పేట సెక్టార్‌లో 4వ వార్డు కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ శనివారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. వీటిని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఎంవీ శ్రీలక్ష్మి, బి.శ్యామలదేవి, శ్యామల కుమారి, హెల్పర్లు పాల్గొన్నారు.



పీబీ దేవంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేసిన నాయకులు

పీబీ దేవంలో..

సామర్లకోట: మండల పరిధిలోని పీబీ దేవంలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. సొసైటి అధ్యక్షుడు మలకల వరాహలబాబు, సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, ఉప సర్పంచ్ మలకల సత్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పంట కాలువల్లో గుర్రపుడెక్కను తొలగించాలి

కొత్తపల్లి: పంట కాలువల్లో పేరుకుపోయిన గుర్రెపు డెక్కను తొలగించాలని సీపీఎం కార్యదర్శి కె.నాగేశ్వరరావు కోరారు. మండలంలోని నాగులాపల్లిలో శనివారం సీపీఎం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగులాపల్లి మాలపల్లి కాలువలో గుర్రపుడెక్క పేరుకుపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పంట కాలువలో పూడిక, గుర్రపుడెక్క తొలగించాలని కోరారు. అనంతరం తత్వవేత్త, చరిత్రకారుడు ఫెడరిక్ ఏంగెల్స్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జి.అప్పారెడ్డి, జీవీ సుబ్బిరెడ్డి, సునీత తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్లు వంద శాతం పూర్తిచేయాలి

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలోని ఈటీసీ లే అవుట్‌లోని లబ్ధిదారులు వంద శాతం ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు అన్నారు. జగనన్న కాలనీలో థర్డ్ ఆప్షన్‌లో రూ.35 వేలు చెల్లించిన లబ్ధిదారులతో కమిషనర్ తన చాంబర్‌లో సమావేశమై చర్చించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సీటీ మిషన్ మేనేజరు సుజాత, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీపై సమీక్ష



వైద్య సిబ్బందికి ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తున్న అధికారులు

పిఠాపురం: నులిపురుగుల నివారణకు గాను ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేయాలని గొల్లప్రోలు ఎంపీడీఓ శర్మ, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ కె. సత్యనారాయణ సిబ్బందికి సూచించారు. గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీపై ఆరోగ్య శాఖ సిబ్బందితో సమీక్షించారు. ఈ నెల 10 నుంచి 17 వరకూ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటి నుంచి ప్రణాళికలు తయారు చేసుకుని, అవసరమైన వారందరికీ మందులు పంపిణీ చేయాలని సూచించారు. అనంతరం వైద్య సిబ్బందికి ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

వందేభారత్ హాల్ట్ సాధన అభినందనీయం

కాకినాడ రూరల్: సామర్లకోటలో వందేభారత్ రైలు హాల్ట్ సాధించిన ఎంపీ వంగా గీతకు ప్రజలందరి తరపున ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అభినందనలు తెలియజేశారు. కన్నబాబు ఆధ్వర్యంలో 48వ డివిజన్ ఎస్.అచ్చుతాపురంలో శనివారం అంబేద్కర్ కాంస్య విగ్రహ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ గీతకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

ప్రాజెక్టులకు మహర్దశ

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే ఆవరణలో పర్యావరణ ప్రాజెక్టులకు మహర్దశ రానుంది. మియావకి ఫారెస్టు, నక్షత్ర వనం జంగిల్ రీడింగ్ బుక్ వంటి ప్రాజెక్టులను మరింత పచ్చదనంతో వృద్ధి చేయనున్నారు. ఈ మేరకు సునీల్ చారిటబుల్ సంస్థను వీసీ ప్రసాదరాజు సంప్రదించగా వారికి ఉన్న జెన్‌కో సంస్థ ద్వారా వర్సిటీలో మౌలిక వసతుల నిమిత్తం రూ.5 కోట్లు మంజూరు చేసేందుకు అంగీకరించారు. వీసీ సమావేశ మందిరంలో శనివారం ఈ మేరకు ఇంజినీరింగ్, జెన్‌కో ఆర్కిటెక్ బృందంతో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఏర్పాటు చేశారు. ఈ నెల 23 నుంచి ప్రారంభమై 2024 ఏప్రిల్‌కు పూర్తిచేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.